## క్లుప్తంగా

### నేడు వలంటీర్లకు సన్మానం

కమలాపురం : ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న గ్రామ, వార్డు వలంటీర్లకు కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా సన్మానిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మండలంలోని అన్ని గ్రామాల్లో పని చేస్తున్న వలంటీర్లకు మెడల్స్, ప్రశంశ పత్రాలు, నగదు పురస్కారాలతో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అన్ని పంచాయతీల కార్యదర్శులు, వలంటీర్లు తప్పక హాజరు కావాలని ఆమె తెలిపారు.

### ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలి

జమ్మలమడుగు : పట్టణ పరిధిలోని ప్రజలు మున్సిపాలిటీకి సకాలంలో పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్. ప్రమోద్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇంటి, నీటి పన్నులను మార్చి నాటికి చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. పట్టణంలో మొండి బకాయిలపై ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామన్నారు.

### బర్డ్‌ఫ్లూ వ్యాధి కోళ్ల ద్వారా వ్యాపిస్తుంది



మాట్లాడుతున్న కమిషనర్ వై.రామకృష్ణ

ఎర్రగుంట్ల : బర్డఫ్లూ వ్యాధి ప్రధానంగా కోళ్ల నుంచి వస్తుందని జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రజలు వ్యాధి బారిన పడతారని మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని చికెన్ అమ్మకదారులకు ఆయన సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ వ్యాధి వైరస్ వలన కోళ్లలో సంక్రమిస్తుదన్నారు. తర్వాత మనుషులకు సంక్రమించేటప్పుడు ప్రమాదకరమైన వ్యాధిగా మరుతుందన్నారు. ఈ వ్యాధి సోకిన కోళ్లను తినడం వల్ల వ్యాపిస్తుందన్నారు. మాంసం గుడ్లులు బాగా ఉడికించి మాత్రమే తినాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యశాల డాక్టర్ మునెయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### 22న విగ్రహ ప్రతిష్ట

చెన్నూరు : మండల పరిధి పుష్పగిరి రోడ్డులోని కాశీపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్యామలా మాతాంగీదేవి ఆలయంలో ఈనెల 22వ తేదీన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:39 గంటలకు పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతిస్వామి చేతుల మీదుగా శ్యామలా మాతాంగీదేవి యంత్ర, విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

**బండలాగుడు పోటీలు..**

ఉత్సవాల్లో భాగంగా 22న న్యూ కేటగిరి విభాగం వృషభ రాజములచే జాతీయ స్థాయి బండలాగుడు పోటీలు జరుగుతాయని తెలిపారు. మొదటి బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ .30 వేలు, మూడవ బహుమతి రూ. 20 వేలు, నాలుగవ బహుమతి రూ. 10 వేలు, ఐదవ బహుమతి రూ. 5 వేలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

### రేపు ఆర్ట్స్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల స్నాతకోత్సవం ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, విద్యాశాఖ కమిషనర్ డా. పోలా భాస్కర్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు కళాశాల పరీక్షల విభాగంలో వారిపేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

### పరీక్షా కేంద్రం తనిఖీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న పీజీ ప్రథమ సంవత్సరం పరీక్షలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ తనిఖీ చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి పరీక్షలను పరిశీలించారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు.

### మార్కెట్ యార్డులో హమాలీల ధర్నా

కడప అగ్రికల్చర్: కడప మార్కెట్‌యార్డులో సోమవారం ఉదయం హమాలీలు ధర్నా నిర్వహించారు. మార్కెట్‌యార్డులో మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేదని యార్డులోని సెక్రటరీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు.

ఈ సందర్భంగా హమాలీలు మాట్లాడుతూ రోజంతా పనిచేసే తమకు ఈ రెండు మౌలిక వసతులు కూడా లేకుంటే ఎలా అని ప్రశ్నించారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు కల్పించుకుని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కార్యాలయ సిబ్బంది కల్పించుకుని సంబంధిత సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

# తెగుళ్లతో దెబ్బతింటున్న నువ్వుల పంట

- రబీలో విస్తారంగా నువ్వుల సాగు
- సాగులో దిగుబడులపై నన్నగిల్లుతున్న ఆశలు
- ఆందోళనలో నువ్వుల సాగు రైతులు



వేములలో సాగు చేసిన నువ్వుల పంట

వేముల : ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లు రైతులకు కలిసి రావడంలేదు. ఖరీఫ్ సాగుకు సకాలంలో వర్షాలులేక పంటలు సాగు కాలేదు. ఆలస్యంగా కురిసిన వర్షాలకు పంటలు సాగు చేసినా ఆశించిన మేర దిగుబడులు లేక రైతులు నష్టాలను చవిచూశారు. ఖరీఫ్‌లో నష్టపోయినా రబీలోనైనా పంటల సాగులో దిగుబడులు ఉంటాయని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతోంది. రబీ సీజన్‌లో అదునులో వర్షాలు లేవు. అదును దాటిన వర్షాలతో నువ్వులు, పెసర పంటలను సాగు చేసుకున్నారు. నువ్వుల పంటకు విపరీతమైన తెగుళ్లు సోకాయి. పంట సాగు చేసిన 20 రోజుల నుంచే తెగుళ్లు సోకడం ప్రారంభమైంది. దీంతో రైతులు తెగుళ్ల నివారణకు మందులను పిచికారి చేస్తూ వచ్చారు. అయినా తెగుళ్లు అదుపులోకి రాలేదు. పంటకు తెగుళ్లు వీడక దెబ్బతింటుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

**ఎకరాకు రూ.15 వేలకుపైనే పెట్టుబడులు :**

నువ్వుల పంటల సాగులో రైతులు పెట్టుబడులు ఎక్కువగానే అయ్యాయి. ఎకరాకు రూ.15 వేలకు పైనే పెట్టుబడులు పెట్టినట్లు రైతులు అంటున్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు ఉంటాయని రైతులు నువ్వుల పంట సాగుపై ఆసక్తి చూపారు. పంట సాగు చేశాక వాతావరణ మార్పులతో తెగుళ్లు సోకడంతో పెట్టుబడులు పెరిగిపోయాయని రైతులు చెబుతున్నారు. పంటకు ఎక్కువగా బూడిద, నల్ల తెగులు సోకాయి. దీంతో పంట దెబ్బతింది.

**విస్తారంగా నువ్వుల సాగు :**

పులివెందుల నియోజకవర్గంలో విస్తారంగా నువ్వుల పంటను రైతులు సాగు చేసుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 8వేల ఎకరాలలో నువ్వుల పంట సాగైందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రబీలో అదును దాటిన వర్షాలు పడకపోవడంతో ప్రత్యామ్నాయ పంటగా రైతులు నువ్వుల పంటను ఎంచుకున్నారు. నియోజకవర్గంలోనే వేముల మండలంలో అత్యధికంగా నువ్వుల పంట సాగైంది.

మండల వ్యాప్తంగా 2 వేల ఎకరాలలో నువ్వుల పంట సాగైంది. వ్యవసాయ బోర్లు, వర్షాధారం కింద పంటను సాగు చేసుకున్నారు.

**తెగుళ్లతో దెబ్బతింటున్న పంట :**

ఈ ఏడాది రబీలో సాగు చేసిన నువ్వుల పంట తెగుళ్లకు దెబ్బతింది. పంట సాగు చేసి 70 రోజులు దాటింది. మరో 10 రోజులలో పంట చేతికొస్తుంది. ఇప్పటికే నాలుగుసార్లు తెగుళ్ల నివారణకు మందులను స్ప్రే చేశారు. అయినా తెగుళ్లు వీడకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్కసారి మందులు స్ప్రే చేస్తే ఎకరాకు మందు, కూలీ ఖర్చులు కలుపుకుని రూ.1000లు ఖర్చు చేస్తున్నారు. దీంతో రైతులకు సాగులో అదనంగా పెట్టుబడులు అవుతున్నాయి. పెట్టుబడులు తక్కువని పంట సాగు చేస్తే తెగుళ్లతో పంట దెబ్బతినడంతో రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు.

**దిగుబడులపై తెగుళ్ల తీవ్ర ప్రభావం :**

నువ్వుల పంటలో తెగుళ్ల దిగుబడులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. నువ్వుల పంట సాగు చేసిన 80 రోజులకు దిగుబడులు వస్తాయి. ఇప్పటికే 70 రోజులు దాటిపోవడంతో మరో 10 రోజులలో పంట కోతకు వస్తుందని రైతులు అంటున్నారు. తెగుళ్లతో పంటను వదులుకోవాల్సి వస్తుందని కొంతమంది రైతులు అంటున్నారు. పంట కోత పనులు చేపడితే దిగుబడులు లేకపోతే అదనపు పెట్టుబడులు అవుతాయని.. పంటను వదులుకోవడమే మేలు అని అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

**5ఎకరాలలో పంట సాగు చేశా..**



ఈ ఏడాది రబీలో 5 ఎకరాలలో నువ్వు పంట సాగు చేశా. పంట సాగు కోసం ఎకరాకు రూ.15 వేలకు పైనే పెట్టుబడి పెట్టా. సాగు చేసిన మొదలు పంటకు తెగుళ్లు సోకాయి. తెగుళ్ల నివారణకు వేలాది రూపాయలు ఖర్చు చేశాను. తెగుళ్లు వీడక పంట దెబ్బతింది. దిగుబడి తగ్గడంతో నష్టాలను చవిచూస్తున్నాం.

– గంగిరెడ్డి(నువ్వు పంట రైతు), గొందిపల్లె

**సాగులో తీవ్రంగా నష్టపోతున్నాం..**



నువ్వుల పంటకు తెగుళ్లు సోకి దిగుబడులు అందక తీవ్రంగా నష్టపోతున్నాం. పంట ఆశాజనకంగా ఉన్నప్పటికి తెగుళ్లతో పంట దెబ్బతింది. మార్కెట్‌లో ధరలు బాగా ఉండటంతో నువ్వుల సాగులో ఆదాయం ఉంటుందని ఆశించాం. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో దిగుబడులు తగ్గిపోయాయి. ఎకరాకు క్వింటా దిగుబడి వచ్చే పరిస్థితి లేదు.

– చంద్రమోహన్‌రెడ్డి(నువ్వు పంట రైతు), గొందిపల్లె

### కంపచెట్లు తొలగింపు



ఎల్లారెడ్డిపల్లె సచివాలయం పక్కనే ఉన్న కంపచెట్లను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

కమలాపురం : మండలంలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తన సొంత నిధులతో రెండు జేసీబీలు ఏర్పాటు చేసి కంపచెట్లు తొలగించారు. సోమవారం మండల పరిధిలోని ఎల్లారెడ్డిపల్లె, నసంతపురం గ్రామాలలో, అలాగే కమలాపురం పట్టణంలోని అక్కానగర్‌కు వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించారు. ఆయా గ్రామాల్లో రహదారుల వెంబడి కంపచెట్లు అడ్డంగా ఉన్నాయని ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే రెండు జేసీబీలు ఏర్పాటు చేసి కంపచెట్లు తొలగిస్తున్నారు. ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే పీఏ కిషోర్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పులివెందుల టౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

# సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం



గ్రామ సచివాలయంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

కొండాపురం : రాష్ట్రంలో అన్ని విధాల అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని యర్రగుడి, తాళ్లప్రొద్దుటూరు గ్రామాలలో గ్రామ సచివాలయం, రైతు బరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ సెంటర్, ఆర్వోప్లాంట్‌లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా గ్రామాల్లోనే గ్రామ సచివాలయాల వ్యవస్థను సీఎం జగనన్న తీసుకొచ్చి వలంటీర్లతో ఇంటి వద్దకే సంక్షేమం అందించడంతో ఇతర రాష్ట్రలు మన రాష్ట్రం ను ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. సంక్షేమంతో పాటు నూతన గ్రామ సచివాలయాలు నిర్మించడంతో అభివృద్ధి బాటలు వేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ నాయకులు అమలు చేయలేని హామీలను మీ ముందుకు తీసుకొస్తాడన్నారు. గతంలో లాగా మోసం పోవద్దన్నారు. పేదల జీవితాలు బాగుపడాలంటే మరో సారి సీఎంగా వైఎస్ జగన్‌ను చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు చింతారాజారెడ్డి, నవజ్యోత్‌రెడ్డి, ఉప మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామసర్పంచ్‌లు రాఘవేంద్రరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, తుంగ శివారెడ్డి, వై.మునయ్య, సాంబశివారెడ్డి, ఆర్ హరినారాయణ రెడ్డి, ఎస్.అంకిరెడ్డి, జగ్గు, సర్పంచ్ పెద్దన్న, కుమ్మెత నాగేశ్వర్‌రెడ్డి, కోడూరు రామ సుబ్బారెడ్డి, కోడూరు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అర్హులకు సంక్షేమపథకాలు**

ముద్దనూరు : రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమపథకాల లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఓబుళాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అర్హులందరికీ పథకాలు వర్తిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వైస్ఎంపీపీ పుష్పలత, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, నవజ్యోత్‌రెడ్డి, గంగాధర్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప మహిళలను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ దివిజా సంపతి

వేంపల్లె : దేశంలో గొప్ప గొప్ప మహిళలను ఆదర్శంగా తీసుకుని బాలికలు చదువులో రాణించాలని ఎంపీడీఓ దివిజా సంపతి తెలిపారు. సోమవారం స్థానిక ఉర్దూఘర్ షాదీఖానాలో మహాత్మ జ్యోతిభా పూలే గురుకుల పాఠశాలలో చదివే 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశంతోపాటు పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా రంగంలో బాలికలు రాణించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాలని పిలుపునిచ్చారు. ఎంఈఓలు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్‌లు మాట్లాడుతూ మధ్యలోనే చదువును ఆపివేయకుండా ఉన్నత చదువులు బాలికలు చదవాలన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని.. తల్లిదండ్రులను సమాజంలో కించపరిచే విధంగా విద్యార్థులు వ్యవహరించరాదన్నారు. కార్యక్రమంలో రిటైర్డు ఎంఈఓ వీరారెడ్డి, ప్రిన్సిపాల్ హరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వలంటీర్ల సేవలు ఎనలేనివి



వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

లింగాల : ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎంపీపీ రమాదేవి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వలంటీర్లకు సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహాత్మగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నెలకొల్పేందుకు వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. ఇందుకు ప్రతి వలంటీర్ శక్తివంచన లేకుండా కృషి చేస్తూ అన్ని ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగింటకే తీసుకెళ్తున్నాడన్నారు. ఆయా రాష్ట్రాల ప్రతినిధులు వలంటీర్ల వ్యవస్థ అమలు తీరును పరిశీలిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వలంటీర్లు శక్తివంచన లేకుండా పనిచేసి తిరిగి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వలంటీర్ వ్యవస్థ వల్ల ప్రజలకు సకాలంలో అన్ని ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని.. ఇలాగే ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి తిరిగి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి వేయించే విధంగా ప్రచారాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా ఎంపీడీఓ తేజ్యోష్ణ మాట్లాడుతూ మండలానికి 5 సేవా రత్న అవార్డులు వచ్చాయని.. సేవా మిత్ర ప్రతి వలంటీర్‌కు అందించడం జరుగుతోందన్నారు. వచ్చే ఏడాది నాటికి సేవా వజ్ర సాధించేందుకు ప్రతి వలంటీర్ పనిచేయాలన్నారు. అదేవిధంగా డీటీ త్రిభువన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మల్లికార్జునరెడ్డిలు వలంటీర్ల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు వలంటీర్లను సన్మానించి అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

### ఎల్‌ఈడీ స్క్రీన్‌ల పరిశీలన



ఎల్‌ఈడీల ఏర్పాటును పరిశీలిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని సమావేశ మందిరాల్లో అధునాతన ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ఏర్పాట్లను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పరిశీలించారు. విశ్వవిద్యాలయంలోని ప్రధాన పరిపాలన భవనంలోని తాళ్లపాక అన్నమాచార్య సెనెట్ హాల్‌లో, ఆర్ట్స్‌బ్లాక్‌లోని సురభి సమావేశ మందిరంలో 10 అడుగుల పొడవు, ఆరు అడుగుల వెడల్పు కలిగిన ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. సమావేశ మందిరాలలో సెమినార్లు, వర్క్‌షాప్‌లు, సింపోజియంలు, సదస్సుల నిర్వహణలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఉపయోగకరం కానున్నాయి. వీసీ వెంట రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ప్రధాన ఇంజినీర్ రాజశేఖరరెడ్డి, డీఈ రామచంద్రారెడ్డి ఉన్నారు.

### నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

వల్లూరు : మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు ఈవోపీఆర్‌డీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 20న దిగువపల్లె, తోల్లగంగనపల్లె గ్రామాలలో, 21న అంబవరం, నల్లపురెడ్డిపల్లె గ్రామాలలో, 22, 23 తేదీల్లో వల్లూరు, గోటూరు గ్రామాలలో, ఆధార్ కేంద్రాలు అందుబాటులో వుంటాయని తెలిపారు. ఇందులో 5 నుండి 15 సంవత్సరాల మధ్య వయసు గల వారికి ఆధార్ కార్డు జారీ చేయడం, ఆధార్ కార్డులో చిరునామా, ఫొటో మార్పుట, ఆధార్ కార్డుకు ఫోన్ నంబరును లింక్ చేయడం, వేలి ముద్రలు అప్‌డేట్ చేయడం, డాక్యుమెంట్ అప్‌లోడ్ చేయడం మొదలైనవి ఉంటాయన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఓటును సక్రమంగా వినియోగించుకోవాలి

ఎర్రగుంట్ల : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంను ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించుకోవాలని ఎర్రగుంట్ల ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం .రవికుమార్‌లు తెలిపారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీపుల్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### హైందవ మత పరిరక్షణకు కృషి చేసిన చత్రపతి శివాజీ



చత్రపతి శివాజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

వేంపల్లె : హైందవ మత పరిరక్షణకు చత్రపతి శివాజీ కృషిచేశారని కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందు జాతి, హిందు నాగరికత, హిందు సంస్కృతి, హైందవ మత పరిరక్షణకు చత్రపతి శివాజీ ఎంతో కృషి చేశారన్నారు. అంతకముందు చత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ.మీరాప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రయాణికులకు, ప్రజలకు, విద్యార్థులకు ఆర్ ఆర్ సంస్థ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా కరపత్రాలు పంచుతూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఓ మురళీధర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు ప్రసాద్, లక్ష్మీ ప్రసన్న, శివ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వేంకటరమణ గోవిందా.. గోవిందా



సింహవాహనంపై శ్రీ వేంకటరమణుడు



ముత్యపు పందిరి వాహనంపై సతీసమేత శ్రీవేంకటరమణస్వామి

పులివెందుల టౌన్ : మము కరుణించరావా శ్రీ వేంకటరమణ గోవిందా.. గోవిందా అంటూ భక్తులు స్వామివారిని ఆరాధించారు. పట్టణంలో వెలసిన శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు సోమవారం ఉదయం శ్రీవారు సింహ వాహనంపై దర్శనమిచ్చారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ నిర్వహించి స్వామి వారికి పట్టు పీతాంబరాలను సమర్పించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం సతీసమేతుడై స్వామివారు ముత్యపు పందిరి వాహనంలో పురవీధులలో జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారు ఊరేగుతుంటే భక్తులు అడుగడుగునా నీరాజనాలు అర్పించారు. శ్రీ వేంకటరమణుడు రాకతో పురవీధులు పులకించాయి. భక్తుల మదిలో భక్తి పారవశ్యం పొంగి పూజాద్రవ్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, తోమాలసేవ, సహస్రనామార్చన, నివేదన, నిత్య హోమం, కలశారాధన, ఇత్యాది కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు నిర్వహించారు. ఉభయదారులతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

# సీతారామ, లక్ష్మణ విగ్రహ ప్రతిష్ట వేడుకలు

సింహాద్రిపురం : మండలంలోని లోమడ గ్రామంలో సోమవారం నిర్వహించిన శ్రీ సీతారామ, లక్ష్మణ విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగపు రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్పుల రామలింగారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా శ్రీ సీతారాముల, శివపార్వతుల కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పవన్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను వైఎస్ అభిషేక్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం పోటీలలో విజేతలుగా నిలిచిన ఎద్దుల యజమానులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న వైఎస్ అభిషేక్‌రెడ్డి

పులివెందుల : వైఎస్సార్‌సీపీ నాయకుడిగా, తుమ్మలపల్లె గ్రామ సర్పంచ్‌గా, పులివెందుల జెడ్పీటీసీగా వివిధ రకాల పదవులు నిర్వహించి ఆ పదవులకే వన్నె తెచ్చిన మంచి మనిషి తుమ్మల మహేశ్వరరెడ్డి అని వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగపు రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి తెలిపారు. సోమవారం ముద్దనూరు రోడ్డులోని పవర్ ట్రాక్టర్ షోరూంలో వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తుమ్మల మహేశ్వరరెడ్డి సంస్మరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్ అభిషేక్‌రెడ్డి హాజరై మహేశ్వరరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహేశ్వరరెడ్డి సతీమణి ఉమాదేవి, కుమారుడు తుమ్మల హేమంత్‌రెడ్డి, కుమార్తె హేమలతలు సమకూర్చిన బియ్యం, నిత్యావసర సరుకులను దివ్యాంగుల కుటుంబాలకు పంపిణీ చేశారు. అనంతరం తుమ్మలపల్లెలో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. అలాగే పులివెందుల, లింగాల మండలాల్లో ఉన్న అనాథ, మానసిక వికలాంగుల, వృద్ధాశ్రమాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.రఘునాథరెడ్డి, మహేశ్వరరెడ్డి, కుటుంబ సభ్యులు తుమ్మల హేమంత్‌రెడ్డి, ఉమాదేవి, హేమలత, తుమ్మల గంగాధరరెడ్డి, ఈశ్వరమ్మ, గంగాధర్, హేమలత తదితర బంధు మిత్రులు పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాను రద్దు ఎలా చేస్తారు

వేంపల్లె : జగనన్న కాలనీలో ప్రభుత్వం లబ్ధిదారునికి ఇచ్చిన ఇళ్ల పట్టాను రద్దు చేసి ఇతరులకు ఎలా ఇస్తారని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ రహమతుల్లా ప్రశ్నించారు. సోమవారం స్థానిక వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లె సచివాలయం–4 పరిధికి చెందిన షేక్ షఫీ, జమీలాకు చింతలమడుగుపల్లె జగనన్న లేఔట్‌లో ఇంటి స్థలాన్ని ప్రభుత్వం కేటాయించిందని.. అందుకు సంబంధించి ఇళ్ల పట్టాను లబ్ధిదారునికి అందజేసిందన్నారు. అయితే లబ్ధిదారునికి ఎలాంటి సమాచారం కానీ, నోటీసు కానీ ఇవ్వకుండా వారి పేరుపైన ఉన్న ఇళ్ల పట్టాను రెవెన్యూ అధికారులు రద్దు చేసి వేరే వారికి కేటాయించడం జరిగిందన్నారు. ఇలా ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇలాంటి అవకతవకలు జరిగిన వాటిపై దృష్టి సారించి అర్హత కలిగి ఇళ్ల పట్టాలు మంజూరైన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### వైద్యం వెంకటేశ్వరాచార్యులకు 'భూతపూరి' అవార్డు

కడప కల్చరల్: మహా కవి శతావధాని డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ అవార్డును ఈ నెల 25న ప్రసిద్ధ కవి, విమర్శకులు వైద్యం వెంకటేశ్వరాచార్యులకు మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహిత్యపీఠం ఆధ్వర్యంలో అందజేయనున్నట్లు అధ్యక్షులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, కార్యదర్శి డాక్టర్ భూతపురి శివరామ సురేంద్ర శర్మ తెలిపారు. ఉదయం 10 గంటలకు సీపీ బ్రౌన్ భాష పరిశోధన కేంద్రంలో జరగనున్న ఈకార్యక్రమానికి డాక్టర్ వై.యస్.ఆర్. ఆర్కిటెక్చర్ – ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్ హాజరవుతారని, యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు. విశిష్ట అతిథిగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద రెడ్డి, ప్రధానవక్తగా సాహితీవేత్త – తెలుగు పండితులు బి.రాజశేఖర్ తదితరులు పాల్గొంటారన్నారు.

**వేలము ప్రకటన**

కడప జిల్లా, సింహాద్రిపురం (మం), అహోబిలాపురం గ్రామం లో వెలసిన శ్రీ భానుకోట సోమేశ్వరస్వామి దేవస్థానమునకు సంబంధించి తలనీలాలు సేకరించుకొనే హక్కు కొరకు 28.02.2024వ తేది ఉదయం 11.00 గంటలకు దేవస్థానము వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించబడును. తలనీలాల పాటకు రూ. 20,000/- ధరావతు చెల్లించవలయును. తక్కిన వేలంపాట షరతులు వేలంరోజు తెలుపబడును.

ఇట్లు: కార్యనిర్వహణాధికారి మరియు గ్రామ పెద్దలు